



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పి.నిర్మల

'అప్పర్ భద్ర'తో సీమకు నష్టం

- 13న కలెక్టరేట్ వద్ద నిరసన - రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.5వేల కోట్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 13న కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్మిక కర్షక భవన్‌లో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర ప్రధాన వనరు అని, అప్పర్ భద్రకు నిధులు కేటాయించడం మూడు జిల్లాల సాగునీటి వనరులను దెబ్బతీయటమేనని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే అపర్ భద్రకు నిధులు కేటాయించారన్నారు. అప్పర్ భద్రకు కేంద్ర జల సంఘం అనుమతి కూడా లేదని, సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. బిజెపి నాయకులు రాయలసీమ అభివద్ధికి బిజెపి కట్టుబడి ఉందని డిక్లరేషన్ లో చెప్పారని, నిధులు ఇవ్వకపోగా తుంగభద్రను ఎడారిగా మార్చే కుట్ర బిజెపి చేస్తోందని విమర్శించారు. బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని పార్టీలు ఒకే మీదకు వచ్చి మూడు జిల్లాల సాగునీటి ప్రయోజనాల కోసం నిలబడాలని, ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే రాబోయే తరం క్షమించదని అన్నారు. రాబోయే కాలంలో మూడు జిల్లాల్లోని పార్టీలు ప్రజాసంఘాలను కలుపుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ మాట్లాడారు..

రాష్ట్ర ప్రభుత్వ వైఖరేంటి?



అప్పర్‌భద్రకు కేంద్రం నిధులు కేటాయించడంపై మంగళ, బుధవారాల్లో మండల కేంద్రాల్లో ధర్నాలకు సిపిఎం పిలుపునిచ్చింది. అప్పర్‌భద్రకు నిధులు కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుకూలమా? ప్రతికూలమా? ప్రభుత్వ వైఖరి ఏంటో చెప్పాలి. దీనిపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించలేదు. ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ బాగుందన్నారు. ఏ రకంగా బాగుందని మేం అడిగాం. ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదు. అప్పర్‌భద్ర కడితే కర్నూలుకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. కర్నూల్‌లో తాగడానికి కూడా నీళ్లు ఉండవు. సీమ నుంచి అనేక మంది ముఖ్యమంత్రి అయిన ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. సుదీర్ఘ పోరాటం చేయకపోతే రాబోయే తరం అంధకారంలోకి రావడానికి మనమే కారణమవుతాం. అడుగుతున్న పోలవరానికి నిధులు కేటాయించకుండా అడగని అప్పర్‌భద్రకు 5వేల కోట్లు కేటాయించారు. బిజెపి నాయకులను ఎక్కడా తిరగనీయకూడదు. ఉన్న వాటిని కాపాడుకోవాల్సిన పరిస్థితి మోడీ ప్రభుత్వంలో ఉంది. ఉద్యమానికి సిపిఎం మద్దతు ఉంటుంది. రైతు సంఘం కార్యక్రమాల్లో పాల్గొంటాం.

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బిజెపి స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి ప్రయత్నాలు చేస్తోంది. మతతత్వ, కులతత్వ పార్టీల అధికారం శాశ్వతం కాదు. ప్రజలు వాళ్ళని తిప్పికొట్టే సమయం దగ్గర్లోనే ఉంది. అప్పర్‌భద్ర కడితే మూడు జిల్లాలు ఎడారిగా మారుతాయి. దీన్ని ఎపి ప్రజలు ఎవరు ఒప్పుకునే ప్రసక్తే లేదు. రైతు సంఘం చేసే ఉద్యమానికి వైసిపి అండగా ఉంటుంది. అప్పర్‌భద్ర కడితే వచ్చే నష్టాలను ప్రజలందరిలోకి తీసుకెళ్లాలి.

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బి.మహేశ్వరరెడ్డి

బిజెపి బరితెగించింది



ప్రపంచీకరణ ప్రారంభమైనప్పటి నుంచి రైతు ఆత్మహత్యలు పెరిగాయి. అందరినీ సమీకరించేందుకు రాజకీయ పార్టీలే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయి. ఒక పక్క 5వేల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తుంటే ఇక్కడ రైతులకు మాత్రం కన్నీరే. అధికారానికి డోకా లేదనే ధీమాతోనే బిజెపి బరితెగించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా రైతాంగాన్ని సమీకరించి ఒక దీర్ఘకాలంగా దీక్ష చేయడానికి అవకాశం ఉంటే ఆలోచించాలి. రైతులకు నమ్మకం నమ్మకం కలిగించేలా నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించాలి.

- రైతు సంఘం సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని



అప్పట్లో ప్రాంతాల అభివద్ధి కోసం ప్రాంతీయ బోర్డులు నివేదికలు ఇచ్చినా అవి అమలులోకి రాలేదు. అందుకే రాయలసీమలో అభివృద్ధి జరగలేదు. నాలుగు జిల్లాలకు ఉపయోగపడేలా తుంగభద్ర డ్యామ్ డిజైన్ చేశారు. ఆ ప్రాంత వాసులకే దక్కని విధంగా తుంగభద్ర తయారవుతోంది. సాంకేతిక అనుమతులు లేకుండా అప్పర్ భద్రను కట్టారని రాష్ట్రాల అభ్యంతరం ఉన్నా దానికి కేటాయింపులు చేశారు. ఎపిలో 14 కరువు జిల్లాలున్నా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకకు నిధులు కేటాయించారు.

- మన్సూర్ రెహమాన్, ఆర్థిక వేత్త

అవసరమైతే మహా పాదయాత్ర



రాయలసీమ చాలా వెనుకబడింది. ఒక తీవ్ర ఉద్యమాన్ని తీసుకురావాలి. మూడు జిల్లాల ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటం చేయాలి. అవసరమైతే అప్పర్‌భద్ర వరకు మహా పాదయాత్ర చేయాలి. జనసేనగా ఎల్లప్పుడూ అండగా ఉంటాం.

- జనసేన నాయకులు అర్షద్

కలిసి ఉద్యమం చేస్తూ న్యాయపరంగా...



రాష్ట్ర రాజకీయ నాయకులు కూడా స్వార్థ ప్రయోజనాల కోసం ఆలోచిస్తున్నారు. అందుకే అప్పర్‌భద్రపై స్పందించలేదు. నల్ల చట్టాలపై సుదీర్ఘ పోరాటం చేసినట్లుగా అప్పర్‌భద్ర నిర్మించకుండా కలిసి ఉద్యమం చేస్తూ న్యాయపరంగా కూడా వెళ్తే బాగుంటుంది. నిర్మాణాన్ని ఆపడానికి సాయశక్తులా కృషి చేయాలి. అందుకు కాంగ్రెస్ తరపున మద్దతు ఉంటుంది.

- కాంగ్రెస్ నాయకులు పోతుల శేఖర్

పోరాటానికి మద్దతు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, వ్యకాస జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురు శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగన్న మాట్లాడుతూ రైతు సంఘం నిర్వహించే ఈ ఆందోళనలో తమ మద్దతు ఉంటుందని, కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, డి వై ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రైతు కూలీ సంఘం నాయకులు అర్లప్ప, రైతు సంఘం కర్నూలు మండల కార్యదర్శి మత్యుంజయ, ప్రజానాట్యమండలి నాయకులు మద్దిలేటి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. దాదాపు 2 గంటలకు పైగా ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరం వద్దకు ఐసిడిఎస్ పీడీ కెఎల్ఆర్‌కె.కుమారి విచ్చేసి యూనియన్ ప్రతినిధి బృందం నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ సమస్యలన్నింటినీ రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు యూనియన్ అధ్యక్షులు రేణుకమ్మ అధ్యక్షతన జరిగిన సభలో పి.నిర్మల, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, రాధాకృష్ణ, అంజిబాబు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతూ కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. దాదాపు ఐదేళ్లుగా టిఎ, డిఎలు లేవని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని చెప్పారు. కేంద్రం అద్దెలు కూడా చాలా తక్కువగా ఇస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులతో పాటు సచివాలయ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ముఖ ఆధారిత హాజరు కూడా నిలిపేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు శోభ, గోవర్ధనమ్మ, సుభాషిని, సోమక్క, ఎబిషా రాణి, బాలదర్గమ్మ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ, సిఐటియు నాయకులు ఎం.గోపాల్, కె.ప్రభాకర్, మోహన్, సాయిబాబు, నరసింహులు పాల్గొన్నారు.

మండలి నగారాకు రెడీ

- ఉపాధ్యాయులు , పట్టభద్రుల మండలి స్థానాలకు ఎన్నికలు
- మరోసారి ఓటరు నమోదుకు దరఖాస్తులు - ఈవారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. పశ్చిమ రాయలసీమ టీచర్స్, పట్టభద్రుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఇసి ఆదేశాలు జారీ చేసింది. మండలి ఎన్నికలు దగ్గర పడుతుండంతో ప్రచారం మరింత వేడెక్కింది. మార్చిలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పదవి కాలం ముగుస్తుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనంతపురం కలెక్టర్ వ్యవహరిస్తారు. సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు వ్యవహరిస్తారు. ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేశారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 61884 మంది ఓటర్లు ఉండగా పురుషులు 42,097, మహిళలు 19,586 మంది ఇతరులు ఒకరు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో 5364 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2963 మంది, స్త్రీలు 2831 మంది ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో వారు పోలింగ్ కేంద్రాలు టీచర్ ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం గుర్తించింది. వచ్చే వారంలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదు చేసుకోలేని ఓటర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది.

పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజ : ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి డాక్టర్ పోతుల నాగరాజు పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలువనున్నారు. ఆయనకు యుటిఎఫ్, ఎస్‌టియు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, సిఐటియు, ఎఐటియుసి లాంటి ప్రజా సంఘాలు కూడా మద్దతును ప్రకటించాయి. ఈ సంఘాల మద్దతుతో ఆయన ప్రచారంలో దూసుకు వెళ్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా వెన్నపూస రవిచంద్ర రెడ్డి బరిలో నిలువనున్నారు. టిడిపి తరపున భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మూరు నాగరాజుతో పాటు మరికొంతమంది బరిలో నిలుస్తారని ప్రచారం. ఉపాధ్యాయ మండలి స్థానానికి పిడిఎఫ్ బలపరిచిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి యుటిఎఫ్, ఎస్‌టియు, రూటా కేజీబీవీ టీచర్స్ అసోసియేషన్లతోపాటు మరికొన్ని సంఘాలు మద్దతుతో బరిలో నిలిచారు. అధికార పార్టీ మద్దతుతో ఎంవి రామచంద్రారెడ్డి టీచర్ల బరిలో నిలిచారు. వీటితోపాటు ఎపిటిఎఫ్ ఇతర సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా డాక్టర్ చామల అనిల్ వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం తరపున జివి నారాయణరెడ్డి, బహుజన్ టీచర్స్ అసోసియేషన్ తరపున రామశేషయ్య బరిలో పోటీకి సిద్ధమవుతున్నారు. అభ్యర్థులు తమ ప్రచారాలను ఇప్పటికే మరింత ఉధృతం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులుకు ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక తదితర ప్రజా సంఘాల నుండి రోజురోజుకు మద్దతు పెరుగుతుంది. ఈ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో నిలిచారు.

ఆర్‌బికెల్లో రైతు మిత్ర నియామకాలు

- కలెక్టర్ కోటేశ్వరరావు - స్పందనలో బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైతు భరోసా కేంద్రాల్లో రైతు మిత్ర వాలంటీర్ల నియామకం చేపట్టాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్, జెసి రామ సుందర్ రెడ్డిలు బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితుల నుంచి వచ్చిన వినతులను విని అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే సమస్య మళ్లీ మళ్లీ బాధితులు తీసుకు రాకుండా వెంటనే వారికి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో అక్కడే స్పందన, ఇతర అంశాలపై సమీక్షించారు. ఒక్క సమస్య కూడా రీఓపెన్ కాలేదని, సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపి అర్జీలు రీ ఓపెన్ కాకుండా శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కింద 1902 కాల్ సెంటర్ ద్వారా ప్రజల సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి వెళ్తాయని చెప్పారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ నాగేశ్వరరావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అప్పలకొండ, డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య డిఇఒ వెంకట రంగారెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



జి జి హెచ్ లో హెపటైటిస్ బి వ్యాక్సిన్ ప్రారంభం

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ జి నరేంద్రనాథ్ రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎఆర్‌టి సెంటర్ లో హెపటైటిస్ బి వ్యాక్సిన్ , హెపటైటిస్ బి వైరస్ టీకాను ప్రారంభించామని ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆస్పత్రిలోని ఎఆర్‌టి సెంటర్లో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అడిషనల్ డిఎంఇ సూపరింటెండెంట్, డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎఆర్‌టి సెంటర్‌లో హెపటైటిస్ బి వ్యాక్సిన్ , హెపటైటిస్ బి వైరస్‌కు టీకా (వ్యాక్సిన్) అందుబాటులోకి వచ్చిందన్నారు. హెచ్ఐవి, హై రిస్క్ గ్రూపుల వారికి ఉచితంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్ , హెపటైటిస్ బి వైరస్ టీకా (వ్యాక్సిన్)ను ఎఆర్‌టి కేంద్రాల్లో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవి, హై రిస్క్ గ్రూపుల వారికి హెచ్ఐవి, హెపటైటిస్ బి సోకే అవకాశం ఎక్కువ అని హెపటైటిస్ బి టీకాలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని తెలిపారు. పేషెంట్ల అవగాహన కొరకు పోస్టర్లు విడుదల చేసి ప్రచారం చేపట్టామని తెలిపారు. హెపటైటిస్ బి ఒక కాలేయ సంబంధిత వ్యాధి అని, హెపటైటిస్ బి సోకిన వ్యక్తి రక్తం, వీర్యం వ, ఇతర శరీర ద్రవాల ద్వారా ఇతరులకు సోకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసి జిల్లా టిబి ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజా కుమార్, ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీహరి, ఎఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకురాలు ఎస్.ఫక్రున్నిసా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. కళాశాలలో ఈమె జంతు శాస్త్ర విభాగ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. బాంబిక్స్ మోరి పట్టుపురుగుల శరీర ధర్మాలపై బపేరియా బాసియానా శిలీంద్రాల ప్రభావం అనే అంశంలో రీసెర్చ్ చేసి తన పరిశోధనా పత్రాలను సమర్పించడంతో డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కళావతి అధ్యాపకురాలని అభినందించారు.

ఆదాని వ్యాపారాలపై సిబిఐ విచారణ అవసరం

పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఆదాని అక్రమ వ్యాపార సంస్థలపై వెంటనే సిబిఐ విచారణ జరపాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు ఎల్ఐసి కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మస్తాన్‌వలి మాట్లాడారు. గతంనుంచే పెద్దఎత్తున మనీ లాండరింగ్ జరుగుతోందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక అన్ని విషయాలను బహిర్గతం చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం అంబాని, ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ఎల్ఐసి, ఎస్‌బిఐ బ్యాంకుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్మును అక్రమంగా మళ్లించడం వల్ల చాలా కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఆదాని గ్రూప్ అక్రమ వ్యాపారాలపై సిబిఐతో పాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగ మధు యాదవ్, జిల్లా కాంగ్రెస్ సమన్వయకర్తలు శ్రీరాములు హరికిరణ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న డిసిసి ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త, జిల్లా ఎసి సెల్ అధ్యక్షులు ఎన్ బజారన్న, కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్ పాల్గొన్నారు.



ఎల్ఐసి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

మరోసారి జగనన్న ముఖ్యమంత్రి : ఎమ్మెల్యే సుధాకర్



ప్రజాశక్తి సి బెళగల్ : వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అవుతారని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, ఎంపిపి మునెప్ప, జడ్‌పిటిసి గిరిజోన్‌లు అన్నారు. సోమవారం మండల పరిషత్ ఆవరణం ముందు గృహ వారదుల సమీక్షలో వారు మాట్లాడారు. దేశంలో అన్నీ రాష్ట్రాలు మెచ్చిన వ్యక్తి జగనన్న అని కొనియాడారు. అదే విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు చేరవేయాలని పేర్కొన్నారు. ఎంపిపి మునెప్ప మాత్రం చివరగా అసభ్య పదజాలంతో టిడిపి పైనా, మీడియా పైనా విచక్షణ కోల్పోయి చిందులు వేశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి రావాలంటే వాలంటీర్లు కీలకమని, వచ్చాక ముఖ్యమంత్రి వారిని రెగ్యులర్ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి :ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈరోజు మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ..మా షాపుకు అడ్డంగా రేకులు, రాడ్లు పాతిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాధవరం గ్రామానికి చెందిన ఈడిగ సుజాత ఫిర్యాదు చేశారు. భర్త హింసిస్తున్నాడని అమడగుంట్లకు చెందిన నాగేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. ప్లాట్‌ను తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి మాపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు, స్వామి రెడ్డి నగర్‌కు చెందిన లత ఫిర్యాదు చేశారు. పెద్దల సమక్షంలో ఖాళీ గా ఉన్న స్థలంను రస్తాకు వదిలారని, అయితే ఒక వ్యక్తి ఆ రస్తాకు అడ్డుగా రాళ్లు వేయించి ఇబ్బందులకు గురి చేస్తు న్నారని, న్యాయం చేయాలని కర్నూలు మండలం, ఇ తాండ్రపాడు గ్రామ వాసులయిన బాధితులు ఆరుగురు ఫిర్యాదు చేశారు. ఎండోమెంట్ డిపార్టు మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన అయ్యన్న ఫిర్యాదు చేశారు. సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్, అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్‌పి నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలను వింటున్న ఎస్‌పి సిద్ధార్థ కౌశల్



కొత్త స్కూటర్‌ను ప్రారంభిస్తున్న టిజి.వెంకటేష్, కెవి.సుబ్బారెడ్డి , పద్మలత

శౌర్య హోండా షోరూంలో నూతన స్కూటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరం సి క్యాంప్ మందలి శౌర్య హోండా షోరూంలో నూతన స్కూటరును మాజీ ఎపి టిజివెంకటేష్ సోమవారం ప్రారంభించారు. కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, 17వ వార్డు కార్పొరేటర్ కె పద్మలత రెడ్డి, హెచ్‌ఎం ఎస్ఐ ఆనంద్ స్వరూప్, బాలకృష్ణ, షోరూం అధినేత కె.విశ్వమోహన్ రెడ్డి, షోరూమ్ లోని ప్రతినిధులకు సిబ్బందికి ఇన్సెంటివ్ టిజి వెంకటేష్ అందజేశారు. మార్కెట్లోకి కొత్తగా వచ్చిన స్కూటర్‌ను వినియోగదారులకు ఆదరించాలనికోరారు. కార్యక్రమంలో షోరూం ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

మైపర్‌లో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జోలాపురం రోడ్డులోని మైపర్ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన మైపర్ క్రికెట్ టోర్నమెంట్‌లో దుర్గా 11 విజయం సాధించింది. రెండో స్థానంలో కోడుమూరు తాలూకా టీమ్ నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవానికి మైపర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి స్థానంలో నిలిచిన దుర్గా 11 టీం కు ట్రోఫీతో సహా రూ.50 వేల బహుమానం ఇచ్చారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఈ అకాడమీ నుంచి కనీసం ఒక్క ప్లేయర్ అయినా రంజికి ఆడాలనేది తన ఆశ అని అన్నారు. తన తల్లి ఆదిములపు థెరిసమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజయవంతంగా ఒక సీజన్ పూర్తి చేసుకున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ సురేష్, దుర్గా 11 టీం కెప్టెన్ సురేష్ , వైస్ కెప్టెన్ శశి, మైపర్ క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు శివ చరణ్, విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. .



క్రికెట్ ట్రోఫీని అందజేస్తున్న మైపర్ కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్



స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్ సింగ్

ప్రజాశక్తి - ఆదోని

'స్పందన'లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి గోవిందు సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో డివిజన్‌లోని ఆయా ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్జీ సమస్యలను వారంలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్‌ఎల్‌ఎలో వెళ్లకుండా చూడాలని సూచించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సత్యవతి, వ్యవసాయ శాఖ ఎడిఎ గిరీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఎస్‌డబ్ల్యుఒ సుధాకర్, ఆదోని మున్సిపల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డి, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

- ప్రధానోపాధ్యాయులు గౌరమ్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు గౌరమ్మ

ప్రజాశక్తి - కౌతాళం

పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు గౌరమ్మ పేర్కొన్నారు. సోమవారం అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రతిభ హైస్కూల్‌ను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు సౌకర్యాలు, విద్యా బోధన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు కూడా ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు మంచి విద్యా బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు విద్యాబోధన పట్ల అడిగి తెలుసుకున్నారు. ప్రతిభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండల పరిషత్ బస్టాండ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం యుటిఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా డి.విజయకుమార్, గౌరవ సలహాదారులుగా జి.వెంకటరమణ, వి.రాముడు, మండల అధ్యక్షులుగా జి.రామన్, సహా అధ్యక్షులుగా ఉమా, లింగన్న, ప్రధాన కార్యదర్శిగా యు. చంద్రపాల్, ఆర్థిక కార్యదర్శిగా అక్బర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.రామచంద్ర, మహిళా విభాగం కార్యదర్శి సలోమి, విశ్రాంతి సాంస్కృతిక విభాగం కార్యదర్శి కృష్ణవేణి, మండల కమిటీ సిపిఎస్ కన్వీనర్‌గా హుస్సేన్, మండల కార్యదర్శిగా శేఖర్ బాబు, కెసి.నాగరాజు, మద్దిలేటి ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా డి.కాశయ్య, శంకర్ నాయక్, నాగేశ్వర రావు, గుమ్మల బాబు, పి.జిక్రియ, జి.రామకృష్ణ, ఎం.దుబ్బన్న, కె.షహనాజ్ ఎంపికయ్యారు. ఎంపికైన మండల నూతన కమిటీ సభ్యులతో జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు ప్రమాణ స్వీకారం చేయించారు.



సభ్యులతో ప్రమాణ చేయిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

-వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి కూలీలు పని చేసిన 12 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఉపాధి కూలీల ఖాతాలో జమ చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం వ్యకాస మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. 12 వారాలు కాలమంటే దాదాపు మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని, వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఎర్రని ఎండలో పని చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వేతనాలు ఇవ్వకుంటే ఉపాధి పనికి రాబోమని కూలీలు చెబుతారని, ఈ నెపంతో ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు పన్నుతోందని తెలిపారు. అందులో భాగంగానే గతేడాది బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయింపులుంటే ఈఏడాది రూ.69 వేల కోట్లకు కేటాయింపులు తగ్గించారని చెప్పారు. కొత్త జాబ్ కార్డు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన వారందరికీ పని కల్పించాలని, పని దినాలు పూర్తయిన వారికి అదనపు పని దినాలు కల్పించాలని కోరారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, రైతు సంఘం నాయకులు సూరి, బడే సాబ్, బజారి, రాముడు, లింగన్న, హుస్సేన్ బాష, పెద్ద రంగన్న పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు



పదో తరగతి విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న ఎంఇఒ

ఇష్టంతో చదివితే విజయం సొంతం

- ఎంఇఒ మస్తాన్‌రావు

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివినప్పుడే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని ఎంఇఒ మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం చిప్పగిరి ఫాతిమా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ఎంఇఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, పదో తరగతి సిలబస్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను మంచి ఉద్యోగాలతో పాటు, మంచి హోదాలో చూడాలని బడికి పంపుతున్నారని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. పట్టుదల ఉంటే కానిది లేదని, కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్య ఉన్నవాడు ఎక్కడికెళ్లినా తెలివితేటలతో, విద్యతో బతకగలరని తెలిపారు. పదో తరగతిలో కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఫాతిమా స్కూల్ ప్రధానోపాధ్యాయులు అజిత, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ పిడిఎఫ్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని ఎస్‌ఐ విజయ్ కుమార్ సోమవారం పట్టుకున్నారు. గూళ్యం గ్రామానికి చెందిన బి.లింగప్ప కుమారుడు బి.బసవరాజ నుంచి సుమారు 15 క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ గిడయ్య, కానిస్టేబుల్ గోవర్ధన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి

- కమిషనర్‌కు పాస్టర్ల వినతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని క్రిస్టియన్ శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు కల్పించాలని ఆదోని క్రిస్టియన్ చర్చెస్ ఫోరమ్ అధ్యక్షులు రెవరెండ్ జోసఫ్ జాషువా, జనరల్ సెక్రటరీ ఆంథోని కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్మశాన వాటిక కోసం అప్పట్లో 11 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల అన్యాక్రాంతం అవుతుందని తెలిపారు. ఖననం చేసే సమయంలో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. రాత్రి వేళలో ఇబ్బంది కలుగకుండా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, మురుగునీరు నిల్వకుండా కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. త్వరలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. పాస్టర్లు ప్రకాష్, రాజశేఖర్, ప్రసాద్, భాస్కర్, సోలోమన్ రాజు, సంజీవరాజు, జయరాజు, ఇమ్మానుయేల్ ఉన్నారు.

ప్రతి పంటకూ ఈకేవైసీ తప్పనిసరి

- ఎఒ ఆనంద్

ప్రజాశక్తి - చిప్పగిరి

సాగు చేసిన ప్రతి పంటకూ రైతులు ఈకేవైసీతో పాటు వేలిముద్ర తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ ఆనంద్ సూచించారు. సోమవారం మండలంలోని రామదుర్గం, నగరడోనా, నేమకల్లు గ్రామాల్లో పప్పు శనగ పంటలను సాగు చేసిన రైతులు ఈకేవైసీ చేయించుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఏ సమస్య వచ్చినా అక్కడికే వెళ్లి పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. ఏ రైతు కూడా అలసత్వం వహించకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. అగ్రికల్ అసిస్టెంట్లు రాకేష్, జ్యోతిర్మయి, సునీత పాల్గొన్నారు.

ముగిసిన కౌలుట్ల స్వామి బ్రహ్మోత్సవాలు

- హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం స్వామి వారి చక్రస్నానం, పారువేటతో ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఛైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు సాగాయి. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి హుండీ లెక్కింపు చేపట్టారు. భక్తాదుల కానుకలు హుండీ ద్వారా రూ.2,67,677, తల వెంట్రుకల ద్వారా రూ.3.60 లక్షలు, టెంకాయల వేలం రూ.1.60 లక్షలు, దర్శన టికెట్లు రూ.53,485, భక్తాదుల డొనేషన్లు రూ.1.10 లక్షల ఆదాయం వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సహాయ, సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న ఆలయ సిబ్బంది

రైలు కిందపడి నిరుద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరుకు చెందిన ప్రసాద్ (26) ఎంబిఎ చదివినా ఉద్యోగం రాకపోవడంతో కలత చెంది తల్లిదండ్రులకు లేఖ రాస్తూ ఆదోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదోని రైల్వే ఎఎస్‌ఐ సాయి వివరాల మేరకు... ప్రసాద్ (26) మూడేళ్ల క్రితం ఎంబిఎ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాలేదు. మనస్థాపానికి గురయి ఆదోని, నగరూరు రైల్వేస్టేషన్‌ల మధ్య 493/8-10 కిలోమీటరు వద్ద పుణే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు లేఖ రాసుకుని ప్రసాద్ జేబులో పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. 'అమ్మ, నాన్న నన్ను క్షమించండి. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, కష్టం లేకుండా చదివించారు. మిమ్మల్ని ఎంతో సుఖపెట్టాలని కలలు కన్నాను. ఉద్యోగం రాకపోవడంతో నేను జీవితంలో విఫలం చెందాన'ని లేఖలో పేర్కొన్నారు. 'జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నాను. నన్ను క్షమించండి' అని అమ్మానాన్నలకు ప్రసాద్ ఉత్తరం రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు బోరున వినిపిస్తూ ఆత్మహత్య చేసుకుని తమ బిడ్డ తమకు కడుపుకోత మిగిల్చాడని కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. ఇంకెంతమంది నిరుద్యోగులను ఈ ప్రభుత్వాలు పొట్టను పెట్టుకుంటాయో అని యువజన సంఘాల నేతలు ఖండించారు.

కొత్తపేట రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కొత్తపేట గ్రామ మట్టి రోడ్డు గుంతలమయం కావడంతో మండల అధ్యక్షులు దాసరి లక్ష్మీదేవి సహకారంతో సర్పంచి షేకమ్మ సోమవారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముల్లకంపలను తొలగించారు. గుంతలమయమైన రహదారిలో గరుసు వేయించి చదును చేశారు. ఈనెల 9 నుంచి ప్రారంభమయ్యే కొత్తపేట ఉరుసు ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని భక్తాదులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా రహదారి మరమ్మతులు చేయించినట్లు సర్పంచి కుమారుడు బాబు తెలిపారు. రహదారి మరమ్మతులు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు సర్పంచికి, ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.



మట్టి రోడ్డు చదును చేస్తున్న ప్రొక్లెయిన్

నేను చేసిందే కరెక్ట్...

- **ఏం చేసుకొంటారో చేసుకోండి**
- **మీకు దేశభక్తి ఉంటే మీరు పెట్టుకోండి**
- **ప్రిన్సిపల్ సింహాద్రి**
- **కళాశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ**

ప్రజాశక్తి-ఆలూరు

'చిత్రపటాలను తొలగించడంలో నేను చేసిందే కరెక్ట్. మీరు ఏం చేసుకొంటారో చేసుకోండి' ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సింహాద్రి సమాధానం ఇచ్చారు. 'మీకు దేశభక్తి ఉంటే మీరు పెట్టుకోండి. నేనైతే పెట్టను' అని తెగేసి చెప్పారు. జాతీయ, స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాత చిత్రపటాలను అవమాన పరచి, గణతంత్ర దినోత్సవం నాడు జెండా ఎగురవేయరాదని, ప్రిన్సిపల్ కళాశాలకు రాలేదు. సోమవారం కళాశాలలో కుర్చీలో నిద్రపోతూ అహంకారంగా మాట్లాడుతూ కనీస గౌరవం ఇవ్వకుండా కళాశాలకు వచ్చిన తహశీల్దార్ మల్లికార్జున, ఎంఇఒ కోమలదేవికి సమాధానం ఇచ్చారు. చిత్రపతాలను తొలగించడంపై ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా... నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. చేసేది లేక తీసి ఉంచిన చిత్రపతాలను తహశీల్దార్, ఎంఇఒ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు ప్రిన్సిపల్ కార్యాలయంలో గోడలకు తగిలించారు. అంతకుముందు ముందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పోతురాజు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్పందనలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్, ఎంఇఒ వెంటనే కళాశాలకు వెళ్లి పరిశీలించారు. కళాశాలలో నిద్రపోతున్న ప్రిన్సిపల్ సింహాద్రిని, గోడలపై తొలగించిన చిత్రపటాలు ఒక మూలన పెట్టిన వాటిని చూసి ఖంగుతున్నారు. విద్యార్థి, యువజన సంఘాల ఫిర్యాదు మేరకు ప్రిన్సిపల్ ప్రవర్తన, నిర్లక్ష్య ధోరణిపై జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. డివైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.



మూలన పెట్టిన చిత్రపతాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రత్యేక హోదా కోసం వికలాంగుని సైకిల్ యాత్ర

- 12 జిల్లాలు, 192 మండలాల్లో ముగిసిన యాత్ర

- అనంతపురం జిల్లా పర్యటనతో పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మారాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమని భావించిన ఓ వికలాంగుడు మూడు చక్రాల బండిపై దేశ యాత్ర చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బోరగాం గ్రామానికి చెందిన వికలాంగుడు నెయ్యల ప్రసాద్ రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రత్యేక హోదా, విశాఖపట్నాన్ని రైల్వే జోన్‌గా చేయాలనే డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా మూడు చక్రాల బండిపై చేపట్టిన దేశ యాత్ర సోమవారం మంత్రాలయం చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్‌కు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విభజనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం తన వంతు బాధ్యతగా 2018 మార్చి 2న యాత్ర మొదలు పెట్టానని చెప్పారు. కరోనా మహమ్మారి కారణంగా అధికారులు అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. అనంతరం ప్రారంభించి 12 జిల్లాలు, 192 మండలాలు తిరిగి ప్రతి మండలంలో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి మొదలైన యాత్ర అనంతపురం జిల్లాతో ముగుస్తుందని తెలిపారు. అనంతపురం జిల్లా మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. యాత్ర కాగానే ఢిల్లీ చేరుకొని ప్రధాన మంత్రి నరేంద్రమోడీని, వెంకయ్య నాయుడును కలిసి రాష్ట్ర ప్రజల ఆవేదనను తెలిపేందుకు ప్రయత్నం చేస్తున్నానని పేర్కొన్నారు.

శ్రీమఠం సేవా కార్యక్రమాలకు రూ.3 లక్షల విరాళం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల నిర్వహణకు భక్తుల నుంచి రూ.3 లక్షలు విరాళంగా వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన భక్తుడు ఎస్ఆర్.వాసుదేవ రావు శ్రీమఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు రూ.లక్ష, బెంగళూరుకు చెందిన భక్తుడు నాగరాజరావు శ్రీమఠంలో జరుగుతున్న (నిత్యాన్నదానంలో భాగంగా) ప్రసాద వితరణకు రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

'గడపగడప' వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు

- రూ.20 లక్షలు అంటున్నారు.. ఏమయ్యాయి - టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

'గడపగడపకు మన ప్రభుత్వం' పేరుతో ఎమ్మెల్యే పర్యటిస్తున్నా స్థానిక ప్రజలకు ఒరిగేదేమీ లేదని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌లు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప విమర్శించారు. సోమవారం పట్టణంలోని సిటీ ప్రెస్ కాంపౌండ్‌లో ఉన్న వారి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సౌదీ రావుఫ్, బసాపురం రామస్వామి, గుడిసె శ్రీరాములు, ఫక్రుద్దీన్‌తో కలిసి వారు మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే 'గడపగడపకు' తిరుగుతున్నామని, ప్రజల నుంచి స్పందన వస్తోందని అధికార పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. అక్కడక్కడ సమస్యల పట్ల ప్రజలు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. 'గడపగడపకు'లో ఎన్ని వినతులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు అన్నది బహిర్గతం చేయాలని కోరారు. 'గడపగడపకు' నిర్వహించిన ప్రాంతంలో సచివాలయానికి రూ.20 లక్షలు ఇస్తున్నామని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రకటిస్తున్నారని, ఆ నిధులతో ఏ అభివృద్ధి పనులు చేపట్టారో ప్రజల వివరించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతూ అనతి కాలంలోనే కోటీశ్వరులు అయ్యారని, ప్రశ్నిస్తే 'మా నాయకుడు భూస్వామి' అని, అందుకే సంపద పెరిగిందని కౌంటర్ ఇస్తున్నారని తెలిపారు. తాము కూడా భూస్వాములేనని, తమ సంపాదన ఎందుకు పెరగలేదని నిలదీశారు. వేసవి రాకముందే గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడిందని, పట్టణంలో కూడా మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. నీటి ఎద్దడి నివారణ చర్యలపై ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. పనుల్లేక కుటుంబాలు గడవక పిల్లాపాపలతో వలసలు వెళుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు చేపడుతున్నారా, దానివల్ల ఏదైనా ప్రయోజనం జరిగిందా అన్నది అధికార పార్టీ నాయకులకు గ్రహించాలని తెలిపారు. తుంగభద్ర నదిపై 'అప్పర్ భద్ర' ప్రాజెక్టు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నా కనీసం ఇక్కడ ప్రాంత ప్రజలు నష్టపోతున్నారన్నది ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని విమర్శించారు. తుంగభద్ర అనంతపురం, కర్నూలు జిల్లా వాసులకు సాగు, తాగునీటికి వరప్రదాయనిగా ఉందన్నారు. అక్కడ నిర్మాణం పూర్తయితే తుంగభద్రకు నీటి ప్రవాహం తగ్గి ఇక్కడ సాగు, తాగునీరు రాక ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. 130 టిఎంసిల సామర్థ్యం గల తుంగభద్ర ప్రాజెక్టు ప్రస్తుతం పూడిక కారణంగా 100 టిఎంసిలకే పరిమితమైందని చెప్పారు. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నీటిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని 'అప్పర్ భద్ర' నిర్మాణం జరగకుండా చూడాలన్నారు. అబద్ధాలు చెప్పడం మానుకొని నిజాయితీగా పాలన అందించాలని హితవు పలికారు. నాయకులు సోమిరెడ్డి, మల్లికార్జున, షేక్షావలీ, మాజీ సర్పంచి గోవిందు, రాముడు, బసాపురం సుధాకర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు ప్రదీప్ కుమార్ పైక్రయి, సంతోష్ కుమార్ ప్రధాన్‌లు పర్యటించారు. సోమవారం గ్రామంలో అధికారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు, ఏ శాఖ నుంచి ఎంత మొత్తంలో గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించారు అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమస్యలను పరిష్కరించడం అధికారుల బాధ్యత అని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికాలకు నివేదికలు అందించి పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. మంగళవారం మిట్టా సోమాపురం, ముగతి గ్రామాల్లో కూడా నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు పర్యటిస్తారని తెలిపారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒఆర్‌డి ఈశ్వర్యయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ వెంకట్రాముడు, ఎపిఎం వీరన్న, ఎపిఒ మాలిక్ బాషా, సూపర్‌వైజర్ సుచరిత పాల్గొన్నారు.



మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనమందించాలి : ఎంపిడిఒ

పాఠశాలలో వంట ఏజెన్సీలు మధ్యాహ్న భోజనంలో కచ్చితంగా మెనూ పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజనానికి రూ.కోట్ల వెచ్చిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తే, మంచి చదువులు చదువుకోవడానికి వీలుంటుందని చెప్పారు. కచ్చితంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలకు పెంచండి

- సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలకు పెంచాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తహశీల్దార్ హుస్సేన్ సాబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కాళ్లప్పాచారి, మండల సహాయ కార్యదర్శులు పెద్దహ్యాట మారెప్ప, రంగన్న మాట్లాడారు. టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇల్లు అందజేయాలని, జగనన్న కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ.5 లక్షలు పెంచాలని గ్రామ గ్రామాన ఆయా వార్డుల్లో తిరిగి సంతకాలు సేకరించామని తెలిపారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్ కుమార్, రైతు సంఘం నాయకులు మౌలా సాబ్, సిపిఐ సహాయ కార్యదర్శి సలాం సాబ్, నాయకులు సిద్ధబసవ గౌడ్, బెనకల్ సిద్ధప్ప, నూర్ బాష, మల్లయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలే జనసేనకు బలం

- రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆదోని



బాధితులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

జనసేన పార్టీకి కార్యకర్తలే బలమని, కార్యకర్తలకు పవన్ కల్యాణ్ అండగా ఉంటున్నారని జనసేన రాష్ట్ర కార్యదర్శి బొల్లిశెట్టి సత్యనారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లప్ప ఆధ్వర్యంలో పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గతేడాది నవంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యులు నామాల పరశురాం కుటుంబానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆదోని జనసేన తరపున ఏర్పాటు చేసిన సంతాప సభలో పరశురాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొల్లిశెట్టి మాట్లాడారు. రాష్ట్రంలో కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యులుగా చూసే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని కొనియాడారు. దశాబ్దాలుగా మెగా ఫ్యామిలీకి నమ్మకమైన వ్యక్తి మల్లప్ప అని, జనసేన కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందులున్నా మల్లప్ప దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం మల్లప్ప మాట్లాడుతూ... ఆదోని జనసైనికుల కుటుంబానికి అండగా నిలబడిన పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదోని నియోజకవర్గంపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు.

టిడిపి నాయకులకు కోట్ల పరామర్శ



గోనెగండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులను సోమవారం కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డితో కలిసి పరామర్శించారు. మండలంలోని నెరుడుప్పల గ్రామానికి చెందిన మాజీ సర్పంచి రామాంజనేయులు పక్షవాతంతో బాధపడుతున్నారు. అలాగే బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధ పడుతున్న పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల రాముడును పరామర్శించి, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అండగా ఉంటామని, పార్టీ అండదండలు అన్నివేళలా ఉంటాయని వారికి భరోసా ఇచ్చారు. మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో పరమేశ్వర రెడ్డి, ప్రభాకర్ నాయుడు, మాజీ సర్పంచి రంగముని, యూనుస్, రాయుడు, ఎన్‌వి.బాబు నాయుడు, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, దరగల మాబు, కౌలుట్లయ్య నాయుడు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అవినాష్ శెట్టి

రాష్ట్ర షూటింగ్ బాల్‌లో విజేతగా నిలవాలి

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

ఈ నెల 10 నుంచి 13 వరకు కృష్ణ జిల్లా హనుమాన్ జంక్షన్ లో జరిగే స్త్రీ పురుషుల విభాగంలో జరిగే 41వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలవాలని కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎం.అవినాష్ శెట్టి అన్నారు. సోమవారం జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవుట్‌డోర్ స్టేడియంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. అవినాష్ మాట్లాడుతూ క్రీడాకారులు అంకితభావంతో సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలు గా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ నరేష్ కుమార్, కోశాధికారి నాగరాజ, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్పందన లో వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపుతానని నగరపాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ అన్నారు. సోమవారం కర్నూలు మున్సిపల్ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోజా వీధికి చెందిన రామస్వామి, ఇతరులు తమవీధిలోని సుంకులమ్మ దేవాలయానికి వెళ్ళే దారి ఆక్రమణకు గురయిందని, తగు విచారణ జరిపించి మరల దారి ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ను కోరారు. లక్ష్మి నగర్ కి చెందిన భాస్కర్ , తమ గృహానికి ఎదురుగా మ్యాన్ హోల్ ఏర్పాటు చేసారని, కాని దానికి మూత ఏర్పాటు చేయనందున, చిన్న పిల్లలకు , పాదచారులకు ప్రమాదంగా మారిందని, వీలైనంత త్వరగా ఆ మ్యాన్‌హోలుకు మూత ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీరామ్ నగర్‌కు చెందిన శివప్రసాద్ తమ వీధిలో ఉన్నటువంటి రోడ్డు ఆక్రమణకు గురి అయినదని, అందువలన తగు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని అభ్యర్ధించారు. వాసవి నగర్‌కు చెందినా హీరాలాల్ , ఇతరులు తమ కాలనీకి ఉత్తర దిక్కున ఉన్నరోడ్డు ఆక్రమణకు గురి అవుతున్నదని దీనివలన తాము తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టెలికాం నగర్ కి చెందిన యాకబ్ , తదితరులు తమ వీధిలో సరియైన రోడ్డు వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ లేనందున తాము ఎంతో ఇబ్బంది పడుతున్నామని,వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు.ఎస్ఇ శేషసాయి, సిటీ ప్లానర్ పి.ప్రదీప్ కుమార్, మేనేజర్ చిన్నరాముడు , ఆర్ఓ. జునీద్ , శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్ తేజ్ , తదితరులు

చర్చి కమిటీ ఆమోదంతోనే ఆర్థిక లావాదేవీలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

కోల్స్ చర్చి లావాదేవిలన్నీ చర్చి గవర్నింగ్ కమిటీ అమ్మోదం తో నే నిర్వహించామని కోల్స్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు ప్రభుదాస్ తెలిపారు. కర్నూలు కోల్స్ బాప్టిస్ట్ చర్చిలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధ్యక్షులు ప్రభు దాస్ , కార్యదర్శి అనిల్ నాథ్ , స్టాండింగ్ కమిటీ కార్యదర్శి పెర్సీస్ బ్యాంకిన్ , మాజీ ట్రెజరర్ అబ్సాలోమ్ రాజ్ మాట్లాడుతూ హావేలన్ బాబు అనే సంఘ సభ్యుడు ఇటీవల తమపై పత్రికల ద్వారా ఆరోపనలు చేసాడని తమ కమిటీ పై తప్పుడు ఆరోపణలు చెశాడని వివరించారు. తమ చర్చి అభివృద్ధి పనులలో భగంగా చర్చిలో ఫంక్షన్ హాల్ కొరకు కట్టే నిమిత్తం తాము ఖర్చు చేసినవి అన్ని చర్చి కమిటీ ఆమోదంతో నే చెక్కు రూపేణా చెలింపులు జరిపామని తెలిపారు. హావేలన్ బాబు తమ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ నాలుగు కోట్ల అవినీతి జరిగిందని తప్పుడు ఆరోపణలు చేశాడన్నారు. చర్చి సభ్యుల గౌవరవానికి భంగం కలిగిస్తున్న హావేలన్ బాబు పై పరువు నష్టం దావాకు సిద్ధమయ్యామన్నారు. కార్యక్రమంలో కోల్స్ బాప్టిస్ట్ సంఘ సభ్యులు పిపి. సుధాకర్ ,ప్రభాకర్ , ఆర్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుదాస్

సిల్వర్ జూబ్లీ విద్యార్థులు విహారయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల ఆర్ట్స్ విభాగానికి చెందిన విద్యార్థులు సోమవారం విహారయాత్రకు వెళ్లారు. ఈ విహారయాత్ర బస్సును వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు న్యూఢిల్లీ ,ఆగ్రా, మధుర ప్రాంతాలకు విద్యార్థులు విహారయాత్రకు వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్‌రెడ్డి అధ్యాపకులు నాగన్న, రామాంజనేయులు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి విహారయాత్ర బస్సును ప్రారంభిస్తున్న విసి సాయిగోపాల్

రూ .5 లక్షలకు పెంచాలి సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

నిరుపేదల గహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న రుణాలను రూ.ఐదు లక్షలకు పెంచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.గిడ్డయ్యతోపాటు రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచంద్రయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జగనన్న కాలనీలో గహ నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రుణ సాయం ప్రజలకు నిర్మాణాలకు సరిపోవడం లేదన్నారు. రుణ సాయాన్ని రూ.5 లక్షల పెంచడమే కాకుండా ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలను కూడా పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జగన్నాథ గట్టు సమీపంలోని ఇందిరమ్మ గృహాల్లో మౌలిక వసతులు కల్పించే పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం, మునెప్ప ,రసూల్ ,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో నిలిచిన నాడు నేడు పనులు

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని పెండేకల్లు, ఆర్ఎస్, రామకొండ, రాంపల్లితో పాటు వివిధ గ్రామాలలో జరుగుతున్న నాడు నేడు పనులకు ఇసుక లేకపోవడంతో ఆగిపోయాయి. దీంతో నాడు నేడు కింద జరుగుతున్న పనులు నత్త నడకగా కొనసాగుతున్నాయి. ఇసుక దొరకాలంటే తాడిపత్రి నుండి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని విద్యా కమిటీ చైర్మన్లు వాపోతున్నారు. కలెక్టర్ మాత్రం నాడు నేడు పనులకు ఏ మాత్రం కొదవలేదని ఒక పక్క చెబుతున్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఇసుక కొరతతో పనులు నిలిచిపోతున్నాయని కమిటీ చైర్మన్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నాడు నేడు పనులకు బ్రేకు పడకుండా ఇసుకను అందుబాటులో ఉండే విధంగా చొరువ తీసుకోవాలని కోరుతున్నారు.

ఎపిఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ


ఎన్‌జిఒ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు వెంగళ్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2023 సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ వెంగల్ రెడ్డి వి జవహర్ లాల్, నగర అధ్యక్షులు కాశన్న, గజిటెడ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి వెంకటేశ్వర్లు పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల అసోసియేషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా నాయకులు సాంబశివరెడ్డి రామకష్ణారెడ్డి ,బలరాం రెడ్డి ,రమణ, ప్రభాకర్ రెడ్డి, మధులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం: అర్బన్ సిఐ

ప్రజాశక్తి-పత్తికొండ



రాజీమార్గమే రాజ మార్గమని పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ ఉన్నారు. సోమవారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో నేషనల్ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. సిఐ మురళీమోహన్ మాట్లాడుతూ సోమవారం నుండి శనివారం వరకు నేషనల్ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పేకాట మట్కా సంబంధించిన 41 కేసులను పరిష్కరించామని అన్నారు. 20 కేసులకు సంబంధించిన అభ్యర్థులకు కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. కక్షిదారులు డబ్బు సమయం వృధా చేసుకోకుండా రాజీమార్గమును ఎన్నుకోవాలని కోరారు.

ఉచితంగా పిఒఎస్ డిజిటల్ మిషన్ల అందజేత

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్ : ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్స్ నిర్వాహకులకు ఉచితంగా డిజిటల్ లావాదేవీల పేటిఎం పిఒఎస్ మిషన్లు సోమవారం జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అందజేశారు.జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న సాంకేతిక రోజుల్లో ప్రజలు చాలా వరకు నగదు రహిత లావాదేవీలు ఎక్కువ శాతం చేస్తున్నారన్నారు. అందులో ఫోన్ పే, గూగుల్ పే తదితర యుపిఐ లావాదేవీల ద్వారా చెల్లింపులు చేస్తున్నారన్నారు. పేటిఎం పిఒఎస్ డిజిటల్ మిషన్లు మత్స్య శాఖ వారి సహకారంతో నిర్వాహకులకు ఉచితంగా అందజేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామల, సిపిఒ అప్పలకొండ పాల్గొన్నారు.

ఆదానీ అక్రమ వ్యాపారాలపై సిబిఐ విచారణ జరపాలి

కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జె లక్ష్మి నరసింహా యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వ్యాపారవేత్త ఆదాని అక్రమ వ్యాపారాలపై సిబిఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలకు నష్టం చేకూరేలా వాటి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన ఆదాని సంస్థపై వచ్చిన ఆర్థిక ఆరోపణలపై విచారణ చేయకుండా వారికి కొమ్ముకాయడం దారుణమన్నారు. ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గతంలోనే పెద్దఎత్తున మనీలాండరింగ్ జరుగుతోందని దీని వల్ల దేశానికి తీవ్రమైన ఆర్థిక నష్టం జరుగుతుందని హెచ్చరిస్తూ వస్తున్నారన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక అన్ని విషయాలను బహిర్గతం చేసిందని, కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ఎల్ఐసి, ఎస్‌బిఐ బ్యాంకుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్మును అక్రమంగా మళ్లించడం వల్ల చాలా కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఎల్ఐసిలో రూ.18 వేల కోట్లు, ఎస్‌బిఐకి రూ.45 వేల కోట్లు ఆదానీ గ్రూప్ సంస్థల వల్ల నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంకా చాలా బ్యాంకులు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయని, ఈ వ్యవహారం దేశానికి చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుందన్నారు. సిబిఐతో పాటు సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. డిసిసి ఉపాధ్యక్షులు బాలస్వామి, మైనార్టీ సెల్ చైర్మన్ పఠాన్, అభి, ఖాన్, వెంకట్ నాయుడు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

అద్దె భవనములో ప్రభుత్వ వసతి గృహం

ఇబ్బందుల్లో విద్యార్థులు..

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్‌లో ప్రభుత్వ బాలుర వసతు గృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ బాలురు వసతి గృహం పూర్తిగా శిధి లావస్తుకు చేరుకుంది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ వసతి గృహాన్ని తొలగించింది. దీంతో హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు గత్యంతరం లేక ఇంటి దగ్గర నుండి తిరగాల్సి వచ్చింది. అక్కడ చదివిన పూర్వపు విద్యార్థి ప్రస్తుత జడ్జి గంగారావు చొరవ తీసుకుని పెండేకల్లు ఆర్ఎస్‌లో కచ్చితంగా ప్రభుత్వ వసతి గృహం ఉండాల్సిందేనని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆగస్టులో ప్రభుత్వ వసతి గృహం తెరుచుకుంది. ఉన్న ప్రభుత్వ వసతి గృహం పూర్తిగా పాడైపోవడంతో ప్రస్తుతం వసతి గహం అద్దె భవనంలో కొనసాగుతుంది. అద్దె భవనంలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి ప్రభుత్వ వసతి గృహాన్ని మంజూరు చేయాలని, పూర్తిగా పాడైపోయిన వసతి గృహానికి బదులుగా కొత్తగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



11న హైకోర్టు జడ్జి గంగారావు రాక

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పెండేకల్లు ఆర్ఎస్‌లో ఈనెల 11న జరుగుతున్న పూర్వపు విద్యార్థుల సమ్మేళనానికి పూర్వపు విద్యార్థి హైకోర్టు జడ్జి గంగారావు హాజరవుతున్నట్లు పూర్వ విద్యార్థి కారం భాస్కర్ రెడ్డి, సర్పంచి గౌరవ సలహాదారు సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థి గంగారావు పాఠశాలకు చేసిన సేవలు మరవరానివన్నారు. అలాంటి జడ్జి ఇక్కడ చదవడం గర్వించ తగ్గ విషయం అన్నారు. పాఠశాలకు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేయడానికి జడ్జి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మైకేల్, శంకర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటేష్, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్

కదం తొక్కిన.. అంగన్‌వాడీలు



కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న అంగన్‌వాడీలు

- సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు
- ఫేస్ యాప్ ను నిరసిస్తూ ప్రభుత్వంపై ఆగ్రహం
- కలెక్టరేట్ ముట్టడి-ఐసిడిఎస్ పిడికి, డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సోమవారం నంద్యాల కలెక్టరేన్‌ను అంగన్‌వాడీలు ముట్టడించారు. ఎన్నో ఏళ్లుగా అంగన్వాడి వ్యవస్థలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని , కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని సిఐటియు, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. నంద్యాల జిల్లా కేంద్రానికి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించారు. నంద్యాల డిఆర్ఒ పుల్లయ్య, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి ధర్నా వద్దకు వచ్చి అంగన్వాడి వర్కర్స్ యూనియన్ , సిఐటియు నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడి కార్యకర్తల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ అధికార యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కలెక్టరేట్ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి బయలుదేరిన అంగన్వాడీ వర్కర్లు ఆయాలు పెద్ద ఎత్తున తమ డిమాండ్ల సాధన కోసం నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి యేసు రత్నం, ఏ నాగరాజు, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేభారాణి నిర్మలలు మాట్లాడారు. ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, పెండింగులో ఉన్న అంగన్వాడి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లుగా పని చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ పేరుతో అంగన్వాడీలను వేధించడం మానుకోవాలన్నారు. అంగన్వాడీలతో వెట్టిచాతి చేయించుకుంటున్న ప్రభుత్వం వారికి ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో వైఫల్యం చెందింద న్నారు. అంగన్వాడి కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టిక ఆహారం క్వాంటిటీ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజు రోజుకు ధరలు పెరిగిపోతున్నాయని, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కాని అంగన్‌వాడీ వర్కర్స్ మాత్రం చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటూ ప్రభుత్వానికి ప్రజలకు గర్భవతులకు బాలింతలకు పిల్లలకు నిత్యం సేవలందిస్తూ కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంగన్వాడి సెంటర్లను విజిట్ పేరుతో అంగన్వాడీ వర్కర్ల పైన వేధింపులు పెరిగాయని దీంతో అంగన్వాడి వర్కర్స్ మానసిక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ప్రభుత్వం అంగన్వాడి వర్కర్స్‌కు ఇచ్చిన హామీలు అమలు చేసి రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే అంగన్వాడి సెంటర్లకు గ్యాస్ సరఫరా చేసి వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి సెంటర్లను సచివాలయాల పరిధిలోకి తీసుకొని రావాలని నిర్ణయించారని, దీనివల్ల రాజకీయ జోక్యం పెరిగి అంగన్వాడి సెంటర్ల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఇప్పటికే అంగన్వాడి సెంటర్లను ఐసిడిఎస్ పిడి, సిడిపిఒ సూపర్వైజర్లు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. అంగన్వాడి సెంటర్లను బలోపేతం చేయడానికి నిధులు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల ను పరిష్కారం చేయకపోతే చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు.

అంగన్వాడీల ఆందోళనకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంఘీభావం

ప్రజలకు ఉద్యోగులకు ప్రభుత్వాలు మేలు చేసేలా కనపడటం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు అన్నారు. అంగన్వాడీలు చేస్తున్న ఆందోళనలకు పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలు కావని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే ప్రభుత్వాలని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో అంగన్వాడీలకు నామమాత్రం బడ్జెట్ కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంకెల గారడీ చేస్తుందని నవరత్నాల పేరుతో ప్రజలను నట్టేట ముంచుతుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారికి రావలసిన సౌకర్యాలను కల్పించాలన్నారు.



ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, నాయకులు

వినతులను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ స్పందన అర్జీదారుల సమస్యలపై సత్వరమే చర్యలు గైకొని పరిష్కార సేవలు అందించాలని అధికారులను సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారం స్పందనలో 2000కి పైగా దరఖాస్తులు వస్తున్నాయని ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో సరైన కారణాలు వివరిస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎండార్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. బియాండ్ ఎస్-ఎల్ఏలో వున్న స్పందన దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కార మార్గాలు చూపడంతో పాటు టాప్ 4 సర్వీసులలో రేషన్ కార్డులు, పెన్షన్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలు, టాప్ 10 సర్వీసెస్లో పెండింగ్లో వున్న ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల అంశాలను పరిష్కరించి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

స్పందన ఫిర్యాదులకు చట్ట పరిధిలో సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఫిర్యాదుల ను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనలో ఎక్కువగా సివిల్, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తరింటి వేధింపులు, తదితర ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామంజి నాయక్, నంద్యాల టౌన్ డిఎస్పి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

కైలాస ద్వారం వద్ద ప్రసాద వితరణ ప్రారంభం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంకు పాదయాత్రగా వచ్చే భక్తులకు కైలాస ద్వారం వద్ద ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కాలి నడకన వచ్చే భక్తులకు ఉదయం 10 గంటల నుండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, కైలాస ద్వారా వద్ద చలువ పందిళ్ళు వేసి విద్యుత్ విద్యుత్ దీపాలు నీటి మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఈవో లవన్న తెలిపారు. అదేవిధంగా భీమిలికొలను ద్వారా వచ్చే యాత్రికులకు మెట్ల మార్గంలో పైపు ద్వారా తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.



బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న ఇఒ లవన్న

అన్న ప్రసాద వితరణానికి విరాళములు

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించిన యాత్రికులు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి పలువురు విరాళములు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఈనెల 11 నుండి 21 తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులకు ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతిలకు, ఎస్పీ రఘువీరా రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణలకు ఆహ్వాన పత్రికలను ఆలయ అధికారులు అందజేశారు.

మండలి నగారాకు రెడీ

- ఉపాధ్యాయులు , పట్టభద్రుల మండలి స్థానాలకు ఎన్నికలు
- మరోసారి ఓటరు నమోదుకు దరఖాస్తులు
- ఈ వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికల నగరా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. పశ్చిమ రాయలసీమ టీచర్స్ , పట్టభద్రుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఇసి ఆదేశాలు జారీ చేసింది. మండలి ఎన్నికలు దగ్గర పడుతుండంతో ప్రచారం మరింత వేడెక్కింది. మార్చి నెలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పదవి కాలం ముగుస్తుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనంతపురం జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు వ్యవహరిస్తారు. ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేశారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 61884 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు42,097, మహిళలు19,586 మంది ఇతరులు ఒకరు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 5364 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2963 మంది, స్త్రీలు 2831 మంది ఓటర్లున్నారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో వారు పోలింగ్ కేంద్రాలు టీచర్ ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం గుర్తించింది. వచ్చే వారంలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదు చేసుకోలేని ఓటర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది.పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజ : ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి డాక్టర్ పోతుల నాగరాజు పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలువనున్నారు. ఆయనకు యుటిఎఫ్, ఎస్‌టియు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, సిఐటియు, ఎఐటియుసి లాంటి ప్రజా సంఘాలు కూడా మద్దతును ప్రకటించాయి. ఈ సంఘాల మద్దతుతో ఆయన ప్రచారంలో దూసుకు వెళ్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా వెన్నపూస రవిచంద్ర రెడ్డి బరిలో నిలువనున్నారు. టిడిపి తరపున భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మూరు నాగరాజు తో పాటు మరికొంతమంది బరిలో నిలుస్తారని ప్రచారం సా ఉపాధ్యాయ మండలి స్థానానికి పిడిఎఫ్ బలపరిచిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి యుటిఎఫ్, ఎస్‌టియు, రూటా కేజీబీవీ టీచర్స్ అసోసియేషన్లతోపాటు మరికొన్ని సంఘాలు మద్దతుతో బరిలో నిలిచారు. అధికార పార్టీ మద్దతుతో ఎంవి రామచంద్రారెడ్డి టీచర్ల బరిలో నిలిచారు. వీటితోపాటు ఎపిటిఎఫ్ ఇతర సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా డాక్టర్ చామల అనిల్ వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం తరపున జివి నారాయణరెడ్డి, బహుజన్ టీచర్స్ అసోసియేషన్ తరపున రామశేషయ్య బరిలో పోటీకి సిద్ధమవుతున్నారు. అభ్యర్థులు తమ ప్రచారాలను ఇప్పటికే మరింత ఉధృతం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులుకు ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక తదితర ప్రజా సంఘాల నుండి రోజురోజుకు మద్దతు పెరుగుతుంది. ఈ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో నిలిచారు.

స్వదేశీ ఉత్పత్తుల అమ్మకానికి ప్రాధాన్యత ఇవ్వండి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల



శ్రీనివాస ఎలక్ట్రానిక్స్ న్యూ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

మనదేశంలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగదారులకు పరిచయం చేస్తూ అమ్మకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల పాత రెడ్డి హెూటల్ ప్రాంగణం నందు శ్రీనివాస ఎలక్ట్రానిక్స్ న్యూ షోరూమ్‌ను సోమవారం నాడు మంత్రి బుగ్గన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి బుగ్గన మాట్లాడుతూ షో రూమ్ లో ప్రదర్శించిన పలు ఎలక్ట్రానిక్ విదేశీ కంపెనీల వస్తువులను పరిశీలించారు. కొరియా అమెరికా లాంటి దేశాల ఉత్పత్తులతో పాటు మనదేశంలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగదారులకు పరిచయం చేయాలని షోరూం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైసీపీ సీని యర్ నాయకులు చంద్రారెడ్డి, బాబుల్ రెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్ కాజా గూని నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాని వ్యాపారాలపై విచారణ జరిపించాలి

- డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్

పజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆదాని అక్రమ వ్యాపారాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు జయలక్ష్మి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు జ.లక్ష్మి నరసింహ యాదవ్ మాట్లాడుతూ గత ఎనిమిదిన్నర సంవత్సరాలు గా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఆదానీ గ్రూప్ అక్రమ వ్యాపారాలపై సిబిఐతో పాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేసారు. ఎల్ఐసిలో 18 వేల కోట్లు, ఎస్‌బిఐకి 45 వేల కోట్లు ఆదానీ గ్రూప్ సంస్థల వల్ల నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు బాలస్వామి, మైనార్టీ సెల్ చైర్మన్ పఠాన్ అభి ఖాన్, వెంకట్ నాయుడు,



సమావేశంలో మాట్లాడుతున్న జె.లక్ష్మీనరసింహ యాదవ్

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలి

జగనన్న గృహాలకు రూ.5 లక్షలు కేటాయించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలకు ఇస్తున్న లక్ష 80వేల రూపాయలు ఏమాత్రం చాలవని, జగనన్న ఇంటి లబ్ధిదారులకు ఐదు లక్షలివ్వాలని, టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు తక్షణమే స్వాధీనం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ లు డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని, జగనన్న గృహాలకు రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నంద్యాలలోని స్థానిక సిపిఐ కార్యాలయం నుండి భారీ ర్యాలీని కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ సీఎం వైస్ జగన్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకురాలేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఓ పుల్లయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్, మోటా రాముడు, శ్రీనివాసులు, రఘురామ్మూర్తి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి


జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామాలలో మురికినంత శుభ్రం చేసి ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్నా వీరికి 8 నెలల నుంచి వేతనాలు ఇవ్వక పోవడం వలన ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు జిల్లా నాయకులు రణధీర్, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు సుధాకర్, వెంకటరాముడులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించి ఎంపీడీవో మోహన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, చేతి పంపు మరమ్మతులు, సచివాలయాలను శుభ్రం చేయడము గ్రామాల్లో అధికారులకు అందుబాటులో ఉంటూ నిత్యం సేవలు అందిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెల జీతాలు అందక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. సబ్బులు, చెప్పులు, నూనె, చీపుర్లు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, జీవో నెంబర్ 680 ప్రకారం రూ.10వేల వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రత్న స్వామి, నరేష్, మాదన్న, సుశీలమ్మ, రాజశేఖర్, సురేంద్రబాబు, శేఖర్, రత్న స్వామి, రైతు సంఘం నాయకులు మా బాష, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎల్లయ్య మాట్లాడుతూ పనులు చెప్పి చేయించుకోవడం తప్ప స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇచ్చి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపి, రూ.10వేల వేతనం ఇచ్చి, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు మండల కార్యదర్శి దేవదాసు తిమ్మరాజు, బాల నాగన్న, మహాలక్ష్మి, సుంకన్న, మంజుల, నాగన్న, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు స్వాములు, హనుమంతు కోరారు. కొత్తపల్లిలో ఎంపీడీవో మేరీ, ఈవోఆర్డీ శ్రీనివాసులు నాయుడులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు రాజారావు, వెంకటరమణ, సుబ్బరాయుడు, సుబ్బన్న, వెంకటేశ్వర్లు, సురేష్, అంకన్న, ఓబుల్ రాజు, తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మండల స్వచ్ఛభారత్ యూనియన్ నాయకులు విక్టోర్ బాబు అధ్యక్షతన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెల జీతాలు అందక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు, రవి, నాగన్న, సువార్తమ్మ, జయమ్మ, లక్ష్మీ దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు. **మహానంది:** స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, తిరుపతయ్య, మండల కార్యదర్శి సోమన్న పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట స్వచ్ఛభారత్ కార్మికులతో నిరసన వ్యక్తం చేసి, మహానంది ఎంపీడీవో నాగ శివ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాగారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు నారాయణ, శేఖర్ ఏసన్న ఈశ్వరయ్య, సిద్ధారెడ్డి గోపాల్ రాజు, మల్లి, కేశవ, కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : వినతి పత్రం ఇస్తున్న రణధీర్, రామ్ నాయక్, సుధాకర్,



బనగానపల్లె రూరల్ : వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తరువాయి 6వ పేజీలో..



మంత్రి రోజా దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సుబ్రమణ్య స్వామి సన్నిధిలో మంత్రి రోజా

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్రమణ్యస్వామిని ఎపి పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె. రోజా తన భర్తతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అంతకుముందు దర్శనానికి వచ్చిన మంత్రికి ప్రధాన అర్చకులు, దేవస్థానం అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇఒ రామకృష్ణ, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి, సి.ఐ. వెంకటేశ్వర రావు, అర్చకులు నారయణ స్వామి శర్మ, సురేష్ శర్మ, కిట్టయ్య శర్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి చేసిన అన్యాయం జరిగిందని, 2024 ఎన్నికల్లో బిజెపి మూల్యం చెల్లించుగా తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వరావు హెచ్చరించారు. సోమవారం మిడుతూరు మండల కేంద్రంలో సిపిఎం కార్యకర్తల సమావేశం టి ఓబులేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 2023-24 బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన జిల్లాలు అభివృద్ధికి నిధులు కేటాయించకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వైఫల్యం చెందాయని వారు ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడుదారుల అప్పులను రూ.15 లక్షల కోట్లు మాఫీ చేసిన ప్రభుత్వం రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటుంటే వారి రుణాలను మాఫీ చేయకపోవడం విచారకరమన్నారు. వ్యవసారంగాన్ని ఆదుకోవాలని చిత్తశుద్ధి లేదని వారు ఆరోపించారు. దేశంలో 42 శాతం నిరుద్యోగం పెరుగుతున్న ఉద్యోగాలు కల్పించే భరోసా లేకపోగా ప్రతి సంవత్సరం వందలాది పరిశ్రమలు మూతపడి లక్షల మంది ఉద్యోగ కార్మికులు వీధిపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మద్దిలేటి, బాలకృష్ణ, రమణయ్య, సుబ్బన్న, జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వర రావు

అర్హులందరికీ పక్కా గృహాలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్, పట్టణ నాయకులు ఎస్. స్వాములు, షేక్ ఇస్మాయిల్, డి. రామ్ నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు సిపిఎం ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 2001-2004లో పట్టాలు ఇచ్చిన స్థలాలు చూపకుండానే రద్దు చేయడం జరిగిందని, వాటి స్థానంలో కొత్తవారికి జగనన్న కాలనీల పేరుతో పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇళ్ల స్థలాలు రాకుంటే అప్లై చేసుకోండి 95 రోజుల్లో వస్తాయని చెప్పినటువంటి అధికారులు నాయకులు కానీ ఆ హామీ ఆచరణలో ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు దాటుతున్న


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు మున్సిపాలిటీలో అమలు కాకపోవడం శోచనీయమన్నారు. లబ్ధిదారులు ఆన్లైన్లో అప్లై చేసుకోవడానికి సచివాలయాల్లోకి వెళ్తే సైటు ఓపెన్ కావడం లేదు మరలా చెబుతామని కాలయాపన జరుగుతుందో తప్ప ఆచరణలో పేదలకు ఇళ్లస్థలాలకు అప్లై చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికీ పట్టణంలో అనేకమంది పేదలు, రెక్కాడితేగాని డొక్కాడని వ్యవసాయ కూలీలు నిరుపేదలు ఉన్నారన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో పేదలనందరిని సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందర పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు అన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సర్వే చేయించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గణపతి, మహమ్మద్, చిన్న వలి, లబ్ధి దారులు చంద్రశేఖర్, ముక్తియార్, సమీర్, ఫక్రు బాష, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న డిఇ

సాగు నీటిని వృధా చేయరాదు

- ఏప్రిల్ 15 వరకు కేసీకి నీరు : డిఇ

ప్రజాశక్తి - పాములపాడు

కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు సాగునీరును వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, కింది ప్రాంతానికి నీరు వెళ్లే విధంగా పంట పొలాలకు మాత్రమే వినియోగించుకోవాలని కేసీ కెనాల్ డిఇ నెల్లై కొప్పుల ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన కేసీ కెనాల్ వెంట పంట కాలువలకు వదిలే తూములను పరిశీలిస్తూ శాంతి నిలయం సమీపంలో ఉన్న లాకెస్లెల వరకు కెనాల్ వెంట తూములను పరిశీలించారు. పాములపాడు సమీపంలో ఉన్న 104 ఎల్ తూము వద్ద రైతులు చౌడయ్య శ్రీనివాసులు, కె శ్రీనివాసులు తమ పంటలకు నీటిని వదిలాలని డిఇ ప్రసాద్‌ను కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడం వలన మల్యాల నుండి వచ్చే నీరు బంద్ అయిందన్నారు. ప్రస్తుతం ముచ్చుమర్రి నుండి 900 క్యూసిక్ ల నీరును విడుదల చేస్తున్నామన్నారు. అక్కడ నీరు బంద్ అవుతే సుంకే సుల నుండి వదిలేందుకు ఒక టీఎంసీ నీరు సుంకేసులో ఉందన్నారు. తుంగభద్రలో నాలుగున్నర టీఎంసీల నీరు వదిలేందుకు ఉందన్నారు. ఏప్రిల్ 15 వరకు సాగునీరు అందిస్తామని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈయన వెంట ఏఈ శ్రీనివాస్ నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరుడు ఉన్నారు.

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కనకాద్రి పల్లి గ్రామంలోని 50 కుటుంబాలు మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, పార్టీ నాయకులు డి దస్తగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పి చైర్మన్ ఎరబోతుల పాపి రెడ్డి సమక్షంలో టిడిపి పార్టీని వీడి వైసిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టిడిపి నాయకులు వీడి వైసిపిలోకి చేరుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వర్ రెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, తోట మల్లేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మొలక రాజారెడ్డి, శేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైయస్సార్ పార్టీ కండువా కప్పిపార్టీ లోకి సాధారణంగా ఆహ్వానించిన బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారం : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వస్తేనే పట్టణ గ్రామీణ సమస్యలకు పరిష్కారం దక్కుతుందని శ్రీశైలం మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ పట్టణంలోని అర్బన్ కాలనీ, వెంగళ రెడ్డి నగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు. సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు రమేష్ గౌడ్, నాగేశ్వర్ నాయక్, రమణ, శేఖర్, పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, ప్రముఖ న్యాయవాది గోవింద్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, బన్నూరు రామలింగారెడ్డి,


మహిళల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రజా వ్యతిరేక విధులను అవలంబిస్తున్న వైకాపా ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డి సిద్దయ్య, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షులు మల్లేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం కానూరు గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. జాకీర్ ఖాన్ మరణ నాగేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.


బండి ఆత్మకూర్: ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

నికర జలాలు ఉన్నప్పటికీ వాడుకోలేని దుస్థితిలో రాయలసీమ

- బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

నికరజలాలు ఉన్నప్పటికీ సగం నీరు కూడా వాడుకోలేని దుస్థితిలో రాయలసీమ సమాజం వున్నదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడారు. దశాబ్దాల చరిత్ర ఉన్న కె.సి.కెనాల్‌కు కేవలం సుంకేశుల దగ్గర 1.2 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం వుందనీ అన్నారు. కె.సి.కెనాల్ ఆయకట్టు స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించాలని, తుంగభద్ర ఎగువ కాలువ స్థిరీకరణకు తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, తుంగభద్ర దిగువ కాలువ స్థిరీకరణకు


మాట్లాడుతున్న బొజ్జ దశరథరామిరెడ్డి

వేదవతి ఎత్తిపోతల పథకం, ప్రజల హృదయ స్పందనైన సిద్దేశ్వరం అలుగు సాధన కోసం అనేక ఉద్యమాలు జరిపామని అన్నారు. దీనికి పాలకులు గానీ లేదా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు గానీ రాయలసీమ ప్రజల ఆకాంక్షల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధిని చూపలేదని ఆయన విమర్శించారు. రాయలసీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రజలే నాయకులై సిద్దేశ్వరం అలుగు శంఖు స్థాపన చేసినా కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు మొద్దు నిద్రపోతూ రాయలసీమ సమాజం పట్ల వివక్షతను చూపుతున్నారని విమర్శించారు. అప్పర్ భద్ర రిజర్వాయర్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించి, నిధులు కేటాయింపులు చేయడంతో రాయలసీమకు అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెడుతున్న రాజకీయ పార్టీలు రాయలసీమకు హక్కు లన్న నీటిని సక్రమంగా వినియోగించు కొనడానికి చేపట్టాల్సిన స్థిరీకరణ ప్రాజెక్టులపై గళం విప్పకుండా పోలవరం ప్రాజెక్టు నిధుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో సమితి నాయకులు రామచంద్ర రెడ్డి, సుధాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సౌదగర్ మియా తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - నంద్యాల

పిడిఎఫ్ బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ సోమవారం నంద్యాల పట్టణంకు విచ్చేసిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బిసి సంఘం నాయకుడు శేషిపాణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజేయుడు, బిసి,ఎస్‌సి,ఎస్‌టీ, మైనారిటీ విద్యార్థి యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, నాయకులు రాజేష్, సుబ్బు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం


అవార్డును అందుకుంటున్న బ్రహ్మానందాచారి

బ్రహ్మానందాచారికి ఎన్‌టిఆర్ పురస్కారం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానందచారికి ఎన్‌టిఆర్ పురస్కారం లభించింది. గ్రామీణ ప్రాంతలో 900 సామాజిక సేవలుపూర్తి చేసినందుకు గుర్తించి పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా హైదరాబాదులోని త్యాగరాయగాన సభ నందు నిర్వహించిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్ కళారత్న పురస్కారాన్ని బ్రహ్మానందచారికి ప్రముఖ సినీ నటుడు సుమన్, సినిమా దర్శకుడు మహేష్, చంద్ర, పినాకిని యూత్ హెల్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్, రాజు, తదితరులు బ్రహ్మానంద చారిని ఘనంగా సన్మానించి, పురస్కారం అందజేశారు. పురష్కార గ్రహిత బ్రహ్మానందచారి మాట్లాడుతూ తనకు ఈ పురస్కారం ఇచ్చిన పినాకిని యూత్ మురళీమోహన్ రాజుకి, బనగానపల్లె పాత్రికేయులకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్ఫూర్తి తో అనేక సేవా కార్యక్రమాలు చేస్తానని బ్రహ్మానందచారి తెలిపారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - రుద్రవరం

వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని వికలాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షులు మరియదాసు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం రుద్రవరం గ్రామంలోని బెస్త కులానికి చెందిన మురారి ఓబులేసు అనే వికలాంగుడికి ఫ్యామిలీ పెన్షన్ వస్తుందని అంటూ వికలాంగుడైన ఆ పింఛన్లు తొలగించడం జరిగిందని, వికలాంగుల ఆదరణ సేవా సమిత్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అధికారులు వికలాంగులను చిన్నచూపు చూస్తూ వేలాదిగా ఏదో కారణం చెబుతూ పింఛన్లు తొలగించడం జరుగుతుందన్నారు. కనుక ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి కారణాలు చూపించకుండా వికలాంగుల పింఛన్లు తొలగించ కుండా కొత్త పెన్షన్లను మంజూరు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఆర్టీసీ బస్సులలో కేటాయించిన సీట్లు అయితేనేమి రాజకీయ రంగంలో రిజర్వేషన్ అయితేనేమి వివిధ డిపార్ట్మెంట్లో వికలాంగు అన్యాయము జరుగుతూనే వస్తుందన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వికలాంగుల దష్టిలో పెట్టుకొని వారికి న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగులు పాల్గొన్నారు.


వికలాంగుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు మరియదాస్

మహానందీశ్వరున్ని దర్శించుకున్న శ్రీశైలం ఇఒ

ప్రజాశక్తి - మహానంది

మహానందీశ్వర స్వామి వారిని శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న సోమవారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ మర్యాదలతో స్వాగ తం పలికారు. అనంతరం శ్రీశైల దేవస్థానం తరపున మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ మహానంది ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డిని శేష వస్త్రంతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఈనెల 11వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి వి రఘునందన్ అన్నారు. సోమవారం నాడు కోర్టు ఆవరణంలో పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ శాఖ పరిధిలో రాజీకాబడ్డ కేసులు, క్రిమినల్ కేసులు, వీలైన ఎక్కువ కేసులు రాజీ మార్గాన ఒకటయ్య కేసులను తీసుకొని రావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ చెందిన ఎస్సైలు హాజరయ్యారు.

పంట నమోదు నిష్పక్షపాతంగా చేయాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను నిష్పక్షపాతంగా నమోదు చేయాలని నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం పగిడ్యాల పొలిమేరలో రైతుల రబీలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పగిడ్యాల పొలిమేరలో 1432 పసలి సంవత్సర 2023 నాటి ఆన్‌లైన్‌లో నమోదైన రైతులు రబీ సీజన్‌లో సాగు చేసి పంటలను పరిశీలించడం జరిగిందన్నారు. గతంలో మ్యాన్‌వల్‌గా పంట నమోదు చేసేవాలని ప్రస్తుత పరిస్థితులలో అన్‌లైన్‌లో పంట నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒ నాగన్న, ఎఇఒలు అబ్దులుమన్నన్, వెంకటేశ్వర్లు, సర్వేర్ వెంకటకుసుమంతు తదితరులు పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా :** ఈ-క్రాప్ నమోదును మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. సోమవారం తాటిపాడు, తరిగోపుల, 80 బన్నూరు గ్రామాల్లో ఏవో పర్యటించి ఆర్‌బీకే సెంటర్లను సందర్శించారు. అలాగే ఆర్‌బీకే సిబ్బందితో మాట్లాడి ప్రతీ రైతు వివరాలను వ్యక్తిగతంగా పరిశీలించారు. కార్యక్రమ ంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వాణి, బాబు రైతులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాన్ని విజయవంతం చేయండి

- జేసీస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల



సచివాలయ వైయస్సార్ పార్టీ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాన్ని విజయవంతం చేయాలని జేసీస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న తేదీన ఉదయం 9 గంలకు కొలిమిగుండ్ల సాయి సదన్ ఫంక్షన్ హాల్ నందు మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రిజినల్ కోఆర్డినేటర్స్ అమర్నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, అఫ్జాల్ ఖాన్ పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గోశాలల నిర్మాణానికి సహాయం అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

గోశాలల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యాగంటి దేవస్థానం సమీపంలో యాగంటి బసవన్న గోశాల నిర్మాణానికి పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ సనాతన ధర్మంలో గోవుకు ఎంతో ప్రముఖ ప్రాధాన్యత ఉందన్నారు. గోశాల నిర్మాణం పూర్తయితే యాగంటికి వచ్చే భక్తాదులకు పాలు, పెరుగు, నెయ్యి నిత్యం అందుబాటు లో వుంటాయని తెలిపారు. బుర్ర వెంకటేశ్వర్లు ఎంతో మహా సంకల్పంతో యాగంటి దేవస్థానం సమీపంలో గోశాలను నిర్మాణం చేపట్టడం హర్షణీయం అన్నారు. వెంకటేశ్వర్లుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడైనా గోవులకు సంరక్షణ లేకుంటే త్వరలోనే ఇక్కడ ఈ గోశాలలో తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ దోనపాటి యాగంటి రెడ్డి, పాతపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సిహెచ్ నాగిరెడ్డి, వైసిపి నాయకులు గడ్డం వెంకటేశ్వర రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, బెడదల చంద్రశేఖర రెడ్డి, జిల్లేల్ల శంకర్ రెడ్డి, కుమ్మరి సురేష్ బాబు జోలాపురం తిరుపాల్, ఈశ్వర్ నాయక్, నంది పైపుల రామచంద్రారెడ్డి, ఆర్కియాలజీ శ్రీనివాసులు వేములపాడు సుబ్రహ్మణ్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గోశాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని గడపగడప కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ముందుగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సోమవారం గుంతకందాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బికే కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయ అధికారిని సునిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూరగాయలతో ముగ్గులు వేసిన తీరు అందరినీ అలరించింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదురుగా గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడారు. అదేవిధంగా వెలుగోడు పట్టణంలోని నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిలో తెలుగు రాజు, తెలుగు శీను ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర చాపల మార్కెట్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని బృందావన్ ఇంగ్లీష్ మీడియం అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు వంద శాతం అమ్మఒడి వర్తించిన సందర్భంగా ఆ పాఠశాల కరెస్పాండెంట్ ఫయాజ్ అలీ ఖాన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం చేశారు. పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ప్రజలతో ఆరాతీస్తూ గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్ రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, జెడ్పి కోఆప్షన్ నెంబర్ సయ్యద్ సులేమాన్, షంషీర్ అలీ ,నాగేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బోగోలు శివశంకర్ నాయుడు, సుధాకర్ రెడ్డి అమీర్ అలీ ఖాన్ , జబీబుల్లా రామ్మోహన్ రెడ్డి ,ముంతల విజయ భాస్కర్ రెడ్డి, మోత్కూరు నాగేశ్వరరెడ్డి ,తెలుగు రమణ,మహమ్మద్ ఖాన్, ఎం పి టిసి నసిరుద్దీన్, శంకర్ నాయక్, చాంద్ భాషా రాజేష్, అధికారులు డిటి శ్రీనివాసులు, ఎంపీడీవో అమానుల్లా, ఏఈ రవీంద్రనాయక్, హౌసింగ్ ఏఈ శీను, నాయకులు పాల్గొన్నారు.




రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐలు నాగరాజు యాదవ్ ,కేశవరెడ్డి పట్టుకున్నారు. నంద్యాల ఎస్పీవై రెడ్డి ఆల్కలీస్ ఫ్యాక్టరీ తరలిస్తుండగా పట్టుకొని బండి ఆత్మకూరు స్టేషన్లో పంచనామా నిర్వహించి రేషన్ బియ్యాన్ని ఎం ఎల్ ఎస్ పాయింట్‌కు 500 ప్యాకెట్లు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్‌లో : ఎంఇఒ

ప్రజాశక్తి - చాగలమర్రి


ఆన్లైన్ను పరిశీలిస్తున్న ఎంఈవో అనురాధ

మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఎల్కేజీ, యూకేజీ చదివే విద్యార్థినీ, విద్యార్థుల సమాచారాన్ని ఆన్లైన్లో పొందుపరుస్తున్నామని ఎంఈవో అనురాధ తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో, ఎల్కేజీ, యూకేజీ చదివే విద్యార్థుల సమాచారం అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆయా విద్యార్థుల సమాచారాన్ని ఆన్లైన్లో పొందు పరిచేలా చర్యలు తీసుకున్నారు.

సేవా భావంతో సంతృప్తి

- సుమేధ స్కూల్ ఎండి విజయ నాగరాజు

ప్రజాశక్తి - బేతంచెర్ల

సమాజానికి అంకిత భావంతో సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని బేతంచెర్ల సుమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ నాగరాజు అన్నారు. సోమవారం నాడు 'ఆ నలుగురు' స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వన్నూరు బాషకు సుమేధా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ నాగరాజు 20వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ సమాజానికి చేస్తున్న మంచి సేవా కార్యక్రమాలు చూసిన తర్వాత వారిని అభినందించాలని అనుకొని వారిని కలుసుకొని అభినందిస్తూ ఆ నలుగు స్వచ్ఛంద సేవ సంస్థ ఇంకా ఇలాగే చాలా సేవ కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన అన్నారు. అలాగే సుమేధా స్కూల్లో ఉపాధ్యాయు రాలుగా విధులు నిర్వహిస్తున్న చంద్రకళ 3 వేల రూపాయలను ఆ నలుగురు స్వచ్ఛంద సేవ సంస్థ వన్నూరు బాషకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమేధా స్కూల్ ఇన్చార్జి మహేశ్వరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కిషోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల పరిధిలోని బైర్లూటి ప్రాథమిక వైద్యశాల నందు సోమవారం నాడు కిషోర బాలికల స్నేహ పూర్వక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10 నుండి 19 సంవత్సరాల పిల్లలకు రుతు క్రమ సమయంలో పాటించ వలసిన శుభ్రత, అనుసరించవలసిన ఆరోగ్య సూత్రాలను గురించి వైద్యాధికారులు డా. గోపాల్, డా.పవన్ కుమార్ వివరించారు.

ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు వేయండి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని లింగం దిన్నె గ్రామంలో వర్షాకాలంలో వస్తే అడుగు లోతు నీళ్లు నిలబడతాయని ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని, సిసి రోడ్లు వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. లింగం దిన్నె గ్రామంలో ప్రధాన రహదారిలో కొంత సిసి రోడ్డు వేశారు.. ఇంకొంత వేయలేదని తెలిపారు. సంబంధిత అధికారులకు తెలియజేసిన ఇంతవరకు సిసి రోడ్డు వేయలేదని వాపోయారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు, చొరవ చూపి త్వరగా సిసి రోడ్డు వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


లింగం దీన్నే లో సిసి రోడ్డు లేని ప్రధాన రహదారి

సుకన్య సమృద్ధిని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామీణ ప్రాంతాల్లోని ఆడబిడ్డలు కలిగిన తల్లిదండ్రులు తపాలాశాఖ ప్రవేశ పెట్టి సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. చాగలమర్రి పట్టణంలో తపాలాశాఖ సిబ్బందితో గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టరు మౌళీశ్వరరెడ్డి, పోస్టుమాస్టర్ ప్రభాకర్రెడ్డి, సిబ్బంది భాస్కరరావు పాల్గొన్నారు..

సచివాయల్లో ప్రతి రోజు స్పందన : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని ప్రతి సచివాయలలో ప్రతి రోజు స్పందన కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఒ వెంకటరమణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ప్రతి సోమవారం మండల కేంద్రం పగిడ్యాల తహశీల్దార్ కార్యలయంలో స్పందన నిర్వహిస్తునట్లు ప్రతి రోజు సచివాలయలలో మధ్యాహ్నా 3 గంటల నుంయి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

డిజిటల్ వేయింగ్ మిషన్, నెబులైజర్ పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల


ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేబులైజరు, మందులను అందజేస్తున్న

స్థానిక ఆర్ఏఆర్ఎస్ హాల్ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల బ్రాంచ్ వైస్ చైర్మన్ మారుతి కుమార్ సహకారంతో కస్తూర్బా స్కూల్ విద్యార్థినులకు నేబలైజర్, డిజిటల్ వేయింగ్ మిషన్, డిజిటల్ థర్మామీటర్, మందులను డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ, జిల్లా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రసాద రావు చేతుల మీదుగా కస్తూర్బా స్కూలు స్పెషల్ ఆఫీసర్ కళ్యాణికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ నంద్యాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. డిజిటల్ వేయింగ్ మిషన్ ద్వారా అమ్మాయిల బరువుని బట్టి రక్తహీనతను, బలహీనతలను గుర్తించి తగిన ఆహారాన్ని సూచించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే పాణ్యం కస్తూర్బా స్కూలు దూర ప్రాంతంలో ఉన్నందున ఈ సీజన్లో దగ్గు, జలుబు ఉన్న పిల్లలకు నేబిలైజర్ మిషన్ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అమ్మాయిలకు అవసరమయ్యే ఈ మందులన్నీ అక్కడ ఉన్న ఏఎన్ఎం సహకారంతో జాగ్రత్తగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

5వ పేజీ తరువాయి..

రుద్రవరం : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ తాసిల్దార్ మహబూబ్ బాషకు ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మయ్య, ఓబుళపతి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు ,పుల్లమ్మ, నాగేంద్ర, మాట్లాడారు. **జూపాడుబంగ్లా:** గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు నరసింహులు డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లాలో ఎంపిడిఒ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఎంపిడిఒ మంజులావాణికి, ఈఓఆర్డి మనీ మంజరిలకు అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు గోపాలు, స్వాములు, మారెన్న, బోడెన్న, నాగేశ్వరావు, రాజమ్మ, చెంచమ్మ, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ నాయకులు భాస్కర్ అధ్యక్షతన సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు కార్యదర్శి రామ్ మద్దిలేటి మాట్లాడారు. అనంతరం వినతిపత్రం ఎంపిడిఒకు అందజేశారు. **పాణ్యం :** స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

